మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**సంగారెడ్డి టౌన్, 20, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పాలిసెట్-2024 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగారెడ్డి సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్‌లో 3 సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నటీ డిప్లొమాలో ప్రవేశాల కొరకు ఈ నెల 24న జరిగే పాలీసెట్ పరీక్షల కొరకు సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన 7 పరీక్షా కేంద్రాల్లో 2420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9.3 గంటల లోపు చేరుకోవాలని, పరీక్ష కేంద్రంలోకి 10 గంటల నుంచి అనుమతిస్తారన్నారు. 11 గంటల తరువాత ఒక్క నిమిషయం ఆలస్యమైనా అనుమతించడం జరగదని తేల్చి చెప్పారు. డౌన్‌లోడ్ చేసు కున్న హాల్ టికెట్‌పై ఫోటో ప్రింట్ కాని వారు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో అతికించుకుని గెజిటెడ్ అధికా రితో ధృవీకరించుకుని రావాలన్నారు. హాల్‌టికెట్, హెచ్‌బి పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్, ఎరేజర్ తెచ్చుకోవాలని విద్యార్థులకు శ్రీనివాసులు పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, మే 20, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలును కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి స్థానిక విలేఖరులతో చరవాణిలో మాట్లాడుతూ వర్షాలు కురిసే పరిస్థితులు అధికంగా కానవస్తున్నాయని, అందుకు రైతులు ఆరు గాలం కష్టించి పండించిన వరి ధాన్యం వర్షాలకు తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల ద్వార కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కుప్పలు ఎక్కడ పడితే అక్కడే ఉన్నాయని, ప్రభుత్వ వైఫల్యం మూలంగా కొనుగోలులో ఆలస్యం అవుతుండటంతో రైతులు పడరాని పాట్లు పడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. పండించిన వరి ధాన్యం విక్రయించుకుని తిరిగి పంట సాగుకు సిద్ధం కావాల్సి ఉన్నా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వరి ధాన్యంను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు పంటల సాగుకు దూరంగా ఉండాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యంను వెను వెంటనే కొనుగోలు చేసేలా చూడాలి మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి సూచించారు.



అల్లాదుర్గం ఐబి చైరస్తా మీదుగా పట్టపగలే అధిక లోడ్‌తో వెళుతున్న ఇసుక లారీ

## పట్టపగలే జోరుగా ఇసుక అక్రమ రవాణా
### కన్నెత్తి చూడని అధికారులు

**అల్లాదుర్గం, మే 20, ప్రభాతవార్త:** అక్రమ లాభార్జనే ధ్యేయంగా అక్రమార్కులు అక్రమంగా ఇసుకును రవాణా చేస్తూన్నా పట్టించుకునే వారు కరువవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వుల ఆరు కాయలుగా యదేశ్చగా కొనసాగుతోంది. మండల కేంద్రమైన అల్లాదుర్గం ఐబి చౌరస్తా గుండా బీర్కూర్ నుంచి అక్రమంగా పట్టపగలే ఇసుకు రవాణా కొనసాగుతోంది. అనునిత్యం అల్లాదుర్గం మీదుగా 2 వందలకు పైగా లారీల్లో ఇసుకు తరలుతున్నట్లు తెలుస్తోంది. పట్టపగలు, జాతీయ రహదారి గుండా జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్, మొగుడంపల్లి, కర్ణాటకలోని బీదర్ తదితర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకు రవాణా అవుతున్నా అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంటే పలు అనుమానాలకు తావిస్తోంది. లారీల్లో 30నుంచి 35 టన్నుల కెపాసిటీ ఉండగా అక్రమార్కులు ఏకంగా 70 టన్నులకు పైగా ఇసుకును తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లాదుర్గం ఐబి చౌరస్తా గుండా అధిక లోడ్‌తో ఇసుకు లారీలో వందల సంఖ్యలో తరలుతుండటంతో లారీల శబ్దానికి ఐబి చైరస్తాలోని దుకాణదారులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. అధిక లోడ్‌తో వహనాలు నడవరాదని నిబంధనలు ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాతో ప్రభుత్వానికి సైతం పన్నులు రావడం లేదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్న అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది.

## సిద్దిపేట, సిరిసిల్ల రైల్వే లైన్ భూసేకరణ వేగవంతం చేయాలి
### జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిద్దిపేట నుంచి సిరిసిల్ల రైల్వే లైన్ భూసేకరణ జిల్లాలోని చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు, చిన్నకోడూరు, మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్, నారాయణరావుపటే మండలంలో గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. భూ సేకరణ వేగవంతం చేసి రైల్వే అధికారులకు అప్పగించాలన్నారు. కొన్ని గ్రామాల్లో స్టోన్ బ్లాస్టింగ్ వలన పంట నష్టపోతున్న రైతులు నష్ట పరిహారం అందేకే పనులు జరపాలని రైతులు అడ్డుతగుతులుతున్నారని తెలుపగా త్వరగా నష్ట పరిహారం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రైల్వే ప్రాజెక్టు అధికారులు మూర్తి, జనార్ధన్, ఆర్డీఓ సదానందం, అయా మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను అదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందని తగు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలో 9981 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ప్రథమ సంవత్సరం 5711, ద్వితీయ సంవత్సరం 4270 మంది విద్యార్థులు పరీక్షలలో పాల్గొంటారని వివ రించారు. జిల్లాలో పరీక్షలు రాయడానికి 27 పరీక్ష కేంద్రాలన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాష్, అడిషనల్ డిసిపి రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**సిద్దిపేట రూరల్, మే 20, ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీమ్ మొద్దీన్ బాధిత కుటుంబానికి 1995 బ్యాచ్‌మెంట్ మిత్రులు సోమవారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటి అండగా నిలిచారు. జిల్లా కేంద్రంలోని నసీర్‌నగర్‌లో బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. బ్యాచ్ అధ్యక్షులు మహ్మద్ పాషా, త్రీటౌన్ ఎస్ఐ విజయ్ భాస్కర్, బ్యాచ్ మెంటు మిత్రులు శ్రీనివాస్‌రావు, నర్సింగరావు, రాజమల్లు, ప్రభాకర్, అనిల్, రాజిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఫిర్యాదులు చట్టప్రకారం పరిష్కరించాలి
### జిల్లా ఎస్పీ బాలస్వామి

**మెదక్ మున్సిపాలిటీ, మే20 ప్రభాతవార్త:** ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బాలస్వామి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హవేళిఘనపూర్ మండలం ఔరంగాబాద్ గ్రామానికి చెందిన చల్ల రాజు అనారోగ్యంతో ఉన్న నన్నునా ఇన్సూరెన్స్ రూ. 5,00,000 కై చంపేస్తామని బెదిరిస్తున్న నా భార్య, నా చిన్న కుమారుడికి తమరు తగు కౌన్సిలింగ్ ఇవ్వడం లేదా పైన తెలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని హవేళిఘనపూర్ ఎస్ఐకి సూచించారు. అలాగే శివ్వంపేట మండలం భీమ్లా తండాకి చెందిన కెతావత్ శిరీష తనకు 2021లో భీమ్లా తండాకు చెందిన సంతోష్తఓ వివాహం జరిగిందనిర తమకు ఒక బాబు కూడా ఉన్నాడని, తన ఆరోగ్యం బాగా లేక ప్రస్తుతం తన తల్లి వద్ద ఉంటున్నానని, సంవత్సర కాలం గడుస్తున్నా తనకు భర్త తనిని కాపురానికి తీసు కెళ్లడం లేదని, మార్చి నెలలో నాకు తెలసింది ఏమనగా నా భార్త నాకు తెలియకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని, కావున నాకు, నా బాబుకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా, చట్ట ప్రకారం ఫిర్యాదిరి తగిన న్యాయం చేయాలని శివ్వంపేట ఎస్ఐకి సూచించారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ బాలస్వామి

## క్వింటాల్‌కు ఐదు వందల బోనస్ చెల్లించాలి
### తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి
### బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

**కొండపాక, మే 20, ప్రభాతవార్త** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కా ంగ్రెస్ తుంగలో తొక్కి తెలంగాణ రైతులను, ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని వైస్ ఎంపిపి దేవి రవీందర్, అనంతుల ప్రశాంత్, మాజీ రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ ర్యాగళ్ల దుర్గయ్య, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్‌తో కలిసి అయన పరిశీలించారు. రైతులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని రైతులకు బిఅర్ఎస్ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం క్వింటాల్‌కు రూ॥ 500 బోనస్ ఇస్తామన్న రేవంత్‌రెడ్డి పార్టీ అధికారంలోకి రాగానే సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని మాట మార్చడం సరైంది కాదన్నారు. ఎన్నికల ముందు సన్న వడ్లు, దొడ్డువడ్లు అని చెప్పలేదన్నారు. అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల రైతులు పండించిన వరి ధాన్యం వర్షానికి తడిసి పోయిందని మండి పడ్డారు. గత 20 రోజులుగా రోడ్ల మిద ధాన్యం ఉన్న దానిని కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్లనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ధాన్యం నింపడానిక కనీసం గొనె సంచులు కూడా రైతులకు సరిగా సరఫరా చేయాలనే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. బేషరతుగా రైతులకు సన్న దొడ్డు ధాన్యం అని చూడకుండా వెంటనేత క్వింటాల్‌కు రూ॥ 500 బోనస్ చేలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతుల పక్షాన రోడ్లపై వంటా వార్పు కార్యక్రమాలను చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చారించారు. రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తామన్న మాటను బోగస్‌గా చేయవద్దని కోరారు. గత నాలుగు రోజులుగా దనలక్ష్మి రైస్ మిల్లు వద్దకు వెళ్ళిన లారీల నుండి ధాన్యం దించుకొక రైతులను ఇబ్బందులకు రైస్ మిల్లు యాజమానులు ఇబ్బందులకు గురి చేస్తున్నరని మండి పడ్డారు. కార్యక్రమంలో కొల సద్గుణ రవి, తాజా మాజీ సర్పంచులు మల్లమారి రవీందర్, ముస్త్యాల కనకయ్య, నాయకులు సున్నం భాస్కర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్ మెర్గు బాల్‌నర్సయ్య, నర్సింలు, దొమ్మాట చంద్రశేఖర్, భానుచందర్, మల్లేశం, కనకసేన గౌడ్, రాజిరెడ్డి, గౌటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

### రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : వెంకటేషం

**కోహెడ, మే 20, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకుండా నిర్లక్ష్యం చేయడం మూలంగానే అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను అదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ల వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిజెపి పార్టీ మండల శాఖ అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ల అధికారులు నిర్లక్ష్యం చేయడం మూలంగానే అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయి మొలకెత్తుందన్నారు. తడిసిపోయిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. కరీంనగర్ ఎంపి బండి సంజ య్ అదేశాల మేరకు మండలంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతుండడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనియెడల బిజెపి పిలుపు మేరకు అందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, బండ జగన్ యాదవ్, చేపూరి తిరుపతి, కక్కర్ల దామోదర్‌గౌడ్, కంది సత్యనారాయణరెడ్డి, మామిడి కరుణాకర్‌గౌడ్, కొండబత్తిని సతీష్, ఎడమల రాజారెడ్డి, ముంజ సాగర్‌గౌడ్, శ్రీకాంత్, బండ సుమన్ యాదవ్, నాగు అజయ్, పుట్ట లక్ష్మణ్, బింరెడ్డి లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి, తాటిపాముల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## అకాల వర్షాలతో అల్లాడిన రైతులను ఆదుకోవాలి
### -బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి



కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి

**సంగారెడ్డి టౌన్, మే 20, ప్రభాతవార్త :** అకాల వర్షాలతో ఆర్థికంగా నష్టాలకు గురైన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జిల్లా కలెక్టర్‌కు రైతులన ఆదుకోవాలని వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలకు తడిసి పోయిన వరి ధాన్యంను వెంటనే ఐకెపి కేంద్రాల్లో కొనుగోలు చేయాలన్నారు. వడ్లలో తేమ శాతం 15, 17 కాకుండా 20 శాతంగా కొనుగోలు చేయాలన్నారు. గత దశాబ్ద కాలంగా రైతుల నుంచి వసూలు చేసిన హమాలీ డబ్బులలో సగం ప్రభుత్వం భరించి రైతులకు అందచేస్తామని హామి చేసినందుకు వెంటనే రైతులకు సగం హమీలు డబ్బులను రైతుల బ్యాంకు ఖాతల్లో జమచేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు రాజేశ్వరరావు దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్లు మందుల నాగరాజ్, కసిని వాసు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజగౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయ్‌కుమార్, మీనా గౌడ్, శ్రీశైలం, బిక్షపతి, చల్లా ప్రభాకర్‌రెడిన్డ, విశ్వనాథ్, లింగ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందించాలి : డిఎంహెచ్‌ఓ వినోద్ బాబ్జి



చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఓ వినోద్ బాబ్జి

**చేర్యాల,మే21, ప్రభాతవార్త** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందించాలని డిఎంహెచ్‌ఓ వినోద్ బాబ్జి తెలిపారు.సోమవారం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని డిఎంహెచ్‌ఓ వినోద్ అకస్మికంగా తనిఖీలు చేశారు.అనంతరం ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్,సిబ్బందితో మాట్లాడుతూ నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని, తల్లి,బిడ్డల సంరక్షణ చర్యలు చేపట్టి ఐపి,ఓపి సంఖ్యను పెంచాలని సూచించారు.అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు.ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్రవంతి,డాక్టర్లు తిరుపతి,మై మున్నిసా,లతా,శ్రీనివాస్, సిహెచ్‌ఓ సుధీర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
### బిజెపి మండల అధ్యక్షులు రాజు



తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**బెజ్జంకి, మే 20, ప్రభాతవార్త :** అకాల వర్షం కారణంతో పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణితో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే అదుకోవాలని కోరుతూ మండల బిజెపి అధ్యక్షులు కొలిపాక రాజు అధ్వర్యంలో సోమవారం మండల నాయకులు తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అలస్యమవుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సి వస్తుందన్నారు. అకాల వర్షంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి సరిపడా టార్పలిన్ కవర్లు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం తడిసిపోతుందన్నారు. కొనుగోలు సమయంలో కోతలు విధించి రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే బిజెపి అధ్వర్యంలో అందోళన చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. పార్టీ నాయకులు సంగా రవి, బమండ్ల జ్యోతి, కచ్చు సంపత్, రామచం ద్రం, బండి పల్లి సునీత, గంప రవికుమార్, లింగాల లావణ్య, ఒగ్గు కనకయ్య, బుర్ర కిషన్, గొడుగు సంపత్, శీలం వెంకట్, మంగలరావ వేణు, ఎల్లం, నేతి మహేష్ పాల్గొన్నారు.

## వికలాంగుడికి వీల్ చైర్ అందజేత

**నర్సాపూర్ మే, 20. ప్రభాతవార్త :** తల్లిదండ్రులులేని అనాధకు ఆలనాపాలనా లేక అలమటిస్తు నడువలేని స్థితిలో ఉన్న ఓ వికలాంగుడికి నర్సాపూర్ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌సిడిపివో హేమాబార్గవి సహకారంతో నర్సాపూర్ మండలంలోని ఆద్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బోడ గట్టు తండాకు చెందిన జర్పుల దేవిసింగ్‌కు వీల్‌చైర్ అందజేయడం జరిగింది.తల్లిదండ్రులులేని ఆలనాపాలనా లేకఅలమటిస్తు నడువలేని స్థితిలోఉన్న దేవిసింగ్ దీన పరిస్థితి విషయం తెలుసుకున్న బంజారా దివ్యాంగ ఐక్య సమితీ మెదక్ జిల్లా అధ్యక్షులు మాలోత్ విఠల్‌నాయక్,ఉపాధ్యక్షులు రాజులు స్పందించి నర్సాపూర్‌సిడిపివో హేమాబార్గవి సహకారంతో వారి సమక్షంలో దేవిసింగ్ కు వీల్‌చైర్ ను అందజేశారు.వికలాంగుడు దేవిసింగ్ దీనస్థితిని చూసి వీల్‌చైర్ అందించేందుకు సహకరించిన సిడిపివో హేమాబార్గవికి వారు కృతజ్ఞతలు తెలియజ్జేశారు.

## కార్యదర్శులకు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టే విధానం నుండి మినహాయించాలి



నర్సాపూర్‌లో ఎంపిడివో మధులతకు వినతి పత్రం సమర్పిస్తున్న మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు

**నర్సాపూర్ మే, 20. ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలలో జరిగే పనుల నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులు తమ సొంత జేబుల నుండి ఖర్చు పెట్టే విదానం నుండి తమను మినహాయించాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ ఎంపిడివో మధులత కు ఎంపివో వైద్య శ్రీనివాస్ సమక్షంలోమండలంలోని కార్యదర్శులు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో పనుల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నుండి ఎటువంటి న్ధిధులు రాకపోవడంతో గ్రామ పంచాయతీ పనుల నిర్వహణకు గ్రామ కార్యదర్శుల జేబుల నుండి ఖర్చు పెట్టి గ్రామ పంచయతీలను నడుపుతున్నారు.గ్రామ పంచాయతీల నిర్వహణకు ట్రాక్టర్ కు డీజిల్, ,శానిటేషన్, బోర్‌ల రిపేర్‌లు, పైప్‌లైన్‌ల లీకేజీలు, వీధి దీపాల నిర్వహణ వంటి పనులకు కార్యదర్శులు తమకు వచ్చె జీతం నుండి ఖర్చు పెడుతున్నామని తెలిపారు.తమకు వచ్చె జీతం గ్రామ పంచాయతీల నిర్వహణకు అవుతుండగా కుటుంభ పోషణ బారమై అప్పుల పాలవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ఆరు నెలల నుండి గ్రామ పంచాయతీలకు ఎటువంటి నిధులురానందున ఎంపిడబ్ల్యు వర్కర్స్‌ల జీతాలు, కరెంటు బిల్లులు కట్టలేని సరిస్థితులు నెలకొందన్నారు. ఈ మేరకు జూన్ 1 నుండి ఎంపిడబ్ల్యు వర్కర్‌లు విధులకు హాజరుకాలేమని తెలుపుతూ ఈవినతి పత్రం ఇస్తున్నట్లు వారు తెలిపారు.ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం నుండి ఇప్పటి వరకు కార్యదర్శులు సొంతగా ఖర్చు పెట్టిన డబ్బులు కూడ ఇవ్వాలని పేర్కొన్నారు.ఇట్టి ఆర్తిక పరమైన బారాన్ని పంచాయతీ కార్యదర్శుల పై పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలోగ్రామ పంచాయతీ కార్యదర్శులు మల్లేషం, తారాసింగ్, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేశ్, వంశీ, రవి,లలిత, సంగీత, ఊహా,శృతీజ, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలి
### డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్

**మిరుదొడ్డి, మే 20, ప్రభాతవార్త:** దళితుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని లింగుపల్లి డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అనంతరం జరిగిన డిబిఎఫ్ కార్యకర్త సమావేశంలో వినయ్‌కుమార్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుకు ఒత్తిడి తీసుకరావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన అరు గ్యారెంటీలతో పాటు దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అంబేద్కర్ భరోసా పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి చట్టం కింద నిధులను ఖర్చు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులలో పోలీసుల నిర్లక్ష్యం తగదన్నారు. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి దళితుల అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, జిల్లా ఉపాధ్యక్షులు బీమ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డిబిఎఫ్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

# వంట గ్యాస్ కష్టాలు ..!



- వాణిజ్య అవసరాలకు ఫుల్.. గృహాలకు నిల్
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న గ్యాస్ ఏజెన్సీలు
- ఆన్‌లైన్ బుకింగ్ చేసినా.. సమయానికి అందించని వైనం

**హైదరాబాద్, మే 20,ప్రభాతవార్త:** కొన్ని రోజులుగా రాజధాని నగరంలో సిలిండర్ల కొరత ఏర్పడుతోంది. ఇదివరకు బుకింగ్ చేసిన రెండురోజుల్లో వచ్చే సిలిండర్ ప్రస్తుతం పదిరోజులైనా రాకపోవడంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. సిలిండర్ ఎప్పుడొస్తుందని డీలర్లకు ఫోన్లు చేపలేని పరిస్థితి ఇందుకు కారణం సిలిండర్ల బుకింగ్‌కు ప్రత్యేక ఎస్ఎంఎస్ విధానం అమలులో ఉండటమే..దీంతో సిలిండర్లు ఎప్పుడొస్తాయా? అని ఎదురు చూడాల్సి పరిస్థితి.కొన్ని చోట్ల గత నెల బుక్ చేసిన సిలిండర్లు ఇంకా రాలేదంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొబైల్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ రెండు పర్యాయాలు చేస్తే తప్ప..గ్యాస్ ఇంటికి చేరే పరిస్తితి లేదు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల చేతి వాటమో.. లేక డెలివరీ బాయ్స్ జిమ్మిక్కులో తెలియదు వినియోగదారుల ఇంటికి డోర్ లాక్ లేకున్నా.. వంట గ్యాస్ సిలిండర్ మాత్రం సకాలంలో ఇంటికి చేరని పరిస్థితి నెలకొంది.కొన్ని సార్లు బుకింగ్ రద్దయిందని మళ్లీ బుక్ చేయమని సంక్షిప్త సందేశం వస్తుండటంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఒక్క కుటుంబానికి సంవత్సరకాలంలో 12 సిలిండర్లు మంజూరు చేస్తుంది. ఇక్కడే ఏజెన్సీలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నాయి. ఎవరైతే గ్యాస్ తక్కువ వినియోగం చేసేవారుంటారో వారి వివరాలను సేకరించి వారి పేరుమీద గ్యాస్ సిలిండర్లను ఆన్‌లైన్ బుకింగ్ చేసి ఏజెన్సీ నిర్వాహకుల వద్ద ఉంచుతున్నారు. ఎవరైనా అత్యవసరం ఉన్నవారు అడినప్పుడు బ్లాక్‌లో ఉన్నసిలిడర్‌పై అధిక మొత్తంలో తీసుకుని సరఫరా చేస్తున్నారు.సిబ్సిడీ కింద వచ్చే 250 రూపాయలు వినియోగదారుడి ఖాతాలో జమ అవుతుండటంతో వారు ఏజెన్సీ వారికి వారు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

అయితే ప్రస్తుతం ఇంటి గ్యాస్ కొరత ఉన్నా.. వాణిజ్య అవసరాలకు మాత్రం సరఫరా బాగానే ఉంది. అడిగిందే తడవుగా హోటళ్లకు చేరుతున్నాయి. దీన్నిబట్టి గృహ అవసరాల సిలిండర్లు దారి మళ్లుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి అవసరాలకు ఉపయోగించాల్సిన గ్యాస్ హోటళ్లు,వాణిజ్య సంస్థల అవసరాలను తీరుస్తోంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల్లో మూడు ప్రధాన చమురు సంస్థలకు చెందిన వాణిజ్య కనెక్షన్లు యాభై వేలకు మించి లేవు. నగరంలో పెద్ద హోటల్స్, రెస్టారెంట్లలో వాణిజ్య పరమైన సిలిండర్లు వినియోగమవుతుండగా.. చిన్నచిన్న హోటళ్లు, టిస్టాల్స్ వంటి వాటిలో మాత్రం డొమెస్టిక్ సిలిండర్లే వినియోగిస్తున్నారు. దీంతో ప్రతి రోజూ లక్షకు పైగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు దారిమల్లులతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చిన్న సిలిడర్లలో సైతం

**శేరిలింగంపల్లి, మే 20 ప్రభాతవార్త :** వర్షం వచ్చిదంటే చాలు.. శేరిలిం గంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు వరద గోదారులను తలపిస్తుంది. పొటెత్తు తున్న వరద నీటిలోనే వాహనదారుల రాకపోకలు నరకాన్ని తలపిస్తున్నా అధికారులు మాత్రంపట్టించుకోవడంలేదని సర్వ త్రా విమర్శలు వినిపిస్తున్నాయి. లింగంపల్లినుంచి మెహదీపట్నం వరకు వెళ్లేందుకు పాత ముంబై జాతీయ రహదారిని ఉపయోగిస్తుంటంతో ఈ రోడ్డు ఎప్పుడూ వాహనాల రద్దీతో కిటకిటలాడుతుంది.రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న చెరువు వర్షానికి పొంగి బ్రిడ్జి కిందకు నీరు చేరటంతో ఇటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది లకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి పనులలో నాణ్యత లేకపోవడం, గత

## వర్షం వస్తే అక్కడ వరదే..

నాలుగు సంవత్సరాలుగా వర్షంతో బ్రిడ్జి కిందకు వర్షం నీరు చేరటంతో చుట్టుపక్కల కాలనీలక వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పాపిరెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి నుంచి పాపిరెడ్డినగర్ కాలనీ, గృహకల్పకు అదే విధంగా గచ్చిబౌలి, హైటెక్ సిటీకి వెళ్లేందుకు సాఫ్ట్‌వర్ ఇంజనీర్స్, ఉద్యోగులు, వ్యాపారస్థులు, కూలీపనులు చేసుకునే వారు రాకపోకలు సాగిస్తుంటారని, రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు నిలిచిపోవడంతో ఇటువైపుగా ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని ఆయన అన్నారు. ఇక్కడ వర్షం నీరు నిలువకుండా ఉండేందుకు శాశ్వతమైన ప్రణాకికలు రూపొందించటంతో జీహెచ్ఎంసి అధికారులు అవగాహన రాహిత్యంతో ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం ఆ తరువాత చేతులెత్తేయటం పరిపాటిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సదరు బ్రిడ్జికింద నీరు నిలువ ఉండకుండా ఉండేందుకు బ్రిడ్జికి మరోవైపు 8 ఇంచుల ఎత్తుతో సిమెంట్ కాంక్రీట్ వేసినట్లయితే నీరు నిలువకుండా కిందికి వెళ్లేందుకు అవకాశం ఉంటుందని స్థానికులుచెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించే విషయంలో దృష్టి పెట్టాలని, ఈ విషయమై ఎన్నో పర్యాయాలు ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందించామని, అధికారులు స్పందించాలని పాపిరెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# రిసార్టుల్లో..రింగ..రింగా..!

- నగర శివార్లలోనూ పేట్రేగుతున్న విషసంస్కృతి
- ఫాంహౌజ్‌లు, రిసార్టుల్లో అనైతిక కార్యకలాపాలు
- ఫిర్యాదు వస్తేనే స్పందిస్తున్న పోలీసులు



రేవ్‌పార్టీ

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** బావలు సయ్యా.. మరదలు సయ్యా..అంటూ పాటలు.. అసభ్య నృత్యాలు.. మందు.. చిందులు.. రేవ్‌పార్టీలు, ముజ్రాపార్టీలకు నగరంలోని కొన్ని రిసార్ట్‌లు.. అతిథిగృహాలు చిరునామాలుగా మారుతున్నాయి. వీకెండ్ వస్తే చాలు, హిందీ తమిళ టీవీఛానెళ్లు.. సినిమాల్లో కనిపించే కొందరు జూనియర్ ఆర్టిస్టులు, యువతులు అక్కడ సందడి చేస్తున్నారు. స్ట్రిప్‌టీజ్ నృత్యాలతో హాజరైన వారికి కిర్రెక్కిస్తున్నారు. చట్టప్రకారం అసభ్యకర నృత్యాలు, అనైతిక కార్యకలాపాలు నేరమని తెలిసినా ఆయా రిసార్ట్‌ల యజమానులు, రేవ్‌పార్టీలు, ముజ్రాపార్టీలు నిర్వహించేవారికి అద్దెకిస్తున్నారు. ఈనేపథ్యంలో బెంగళూరు శివారు ప్రాంతంలో ఓఫాంహౌజ్‌లో నిర్వహిస్తున్న రేవ్‌పార్టీని సోమవారం తెల్లవారుజామున అక్కడి పోలీసులు భగ్నం చేశారు. సుమారు 150 మంది అరెస్ట్ చేయడంతోపాటు వారి నుంచి కొకైన్, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడ్డవారిలో అధికభాగం సినీనటులు, తెలుగు వాళ్లు ఉండటం విశేషం. దీంతో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ఫాంహౌజ్‌లపైనా చర్చ జరుగుతుంది.

### ఒక్కో ఈవెంట్‌కు ఒక్కోరేటు..

ముఖ్యంగా నగరశివారు ప్రాంతాల్లోని మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, శంషాబాద్, చేవెళ్ల, శామీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట్ ప్రాంతాల్లో ఫాంహౌజ్‌లు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇందులో కొన్ని రాత్రులు పబ్‌లుగా మారుతున్నాయి. ఫాంహౌజ్‌ల బుకింగ్ నుండి సకల సదుపాయాలు కల్పించేందుకు ప్యాకేజీలు ప్రకటిస్తూ అసాంఘీక కార్యకలాపాలకు ఆజ్యం పోస్తున్నారు. ఇందుకు ఒక్కో ఈవెంట్‌కు ఒక్కోరేట్ నిర్ణయించి అద్దెకు ఇస్తున్నారు. వేడుకనుబట్టి రూ.5లక్షల నుంచి 20 లక్షల వరకు వెచ్చిస్తు వచ్చిన అతిథులకు దిల్‌ఖుష్ చేసి పంపుతున్నారు. ఈ సందడిలో మందు, మాదక ద్రవ్యాలు, అనైతిక కార్యకలాపాలు ఉండటంతో ఇంజనీరింగ్ విద్యార్థులు. యువకులు ఆకర్షితులవుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ఢిల్లీ, ముంబై, నాగపూర్, పూణే, విజయవాడ వంటి నగరాల నుంచి ముజ్రాలు, రేవ్ పార్టీల్లో నృత్యాలు చేసే యువతులను నిర్వాహకులు రప్పిస్తున్నారు. అక్కడి వేశ్యవాటికల్లో ఉంటున్న యువతులు, వసతిగృహాల్లోని విద్యార్థులను.టీవీల్లో నటించే యువతులతో ఒప్పందాలు కుదుర్చుకుని తీసుకువస్తున్నారు. ఒక్కొక్కరికీ 30 వేల నుంచి లక్షవరకు చెల్లిస్తున్నారు. విమానాల ద్వారా రప్పించి కారులో నేరుగా రిసార్ట్‌లకు తరలిస్తున్నారు. పార్టీలు పూర్తయ్యాక మళ్లీ విమానాల్లోనే పంపుతున్నారు.

### ఇక్కడైతే ఆంక్షలు.. అందుకే శివార్లలోకి ..

ఇటీవల కాలంలో నగరంలో పబ్‌లు, హుక్కా సెంటర్‌లపై, పేకాటస్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో వీరు శివార్లవైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. రాత్రింబవళ్లు చిత్తుగా మద్యం తాగుతూ అశ్లీల నృత్యాలతో శివార్లు శివాలెత్తుతున్నట్లు సమాచారం. తెల్లవారు జాము వరకు మద్యం సేవించి ఇంటికి వెళ్లే సమయాల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు దొరికిన సంఘటనలు ఇప్పటికే అనేకం . నగరంలో అయితే పోలీసులు ఆంక్షలు ఉంటున్నాయని శివార్లలోని ఫాంహౌజ్‌లనే పార్టీజోన్‌లు ఎంచుకుని అన్ని విధాలా సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఇలాంటి పార్టీలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నా.. వేళ్లమీద లెక్కపెట్టేన్ని కేసులు మాత్రమే వెలుగులోకి వస్తుండటం విచారకరం. అసాంఘీక,అశ్లీల కార్యకలాపాలకు ఆయా ప్రాంతాల్లోని పోలీసులకు తెలిసి తమదైన శైలిలో సహకరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రభుత్వం డీజెలను నగరంలో నిషేదించినా శివార్లలో ఇంకా మారుమోగుతునే ఉన్నాయి

### నామమాత్రపు దాడులు...

ఫాంహౌజ్‌లు, రిసార్ట్‌లలో అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా నిత్యం నిఘా వేయాల్సిన స్థానిక పోలీసులు నామమాత్రపు దాడులు నిర్వహిస్తూ నెలనెల మామూళ్లు అందుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అధిక మొత్తంలో మామూళ్లు చెల్లించిన వారికి, బడాబాబుల పార్టీలకు పోలీసులను రక్షణ కవచంగా ఉంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారాంతపు రోజులు శని,ఆది వారాల్లో ఫాంహౌజ్‌లు,గెస్ట్‌హౌజ్‌లు అశ్లీల కార్యక్రమాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ తరహా పార్టీలపై ఉక్కుపాదం మోపి విషసంస్కృతిని అడ్డుకోవాలని పోలీసులను కోరుతున్నారు.

# దోపిడీ వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత పౌరులదే

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**రవీంద్రభారతి, మే 20 ప్రభాతవార్త :** భారతదేశానికి స్వాతంత్ర్యంవచ్చి సుమారు 77 ఏళ్లవున్నా నేటికీ దేశం, రాజకీయాలు, సమాజం ఎటుపోతుందో అర్థమౌడంలేదని, దేశ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని సన్మార్గంలో పయనించేటట్లు ముఖ్యంగా అన్నిరంగాల్లో దోపిడి విశృంఖలనంగా అడ్డూఅదుపు, మంచిచెడులు పట్టింపు లేకుండా రాజ్యమేలుతుందని, దారితప్పిన ఈ వ్యవస్థలను నిర్మూలించి రూపుమాపాల్సి బాధ్యత, దేశం రాజకీయ నాయకులదీ ఏ ఒక్కరిదీ కాదని, మనందరిదని, దేశాన్ని ఏవిధంగా నడపాలని ఆలోచించాల్సిన అవసరం విజ్ఞులు, విద్యావంతులు, పౌరులపైనే ఉందన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘ జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇందుకు అన్నివర్గాల ప్రజలు నడుంబిగించి ఉద్యమించి వీరోచితంగా పోరాడాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. దేశంలో కావాల్సినన్ని వనరులు, సంపదలున్నా కేవలం అధికారం,రాజకీయాలే పరమావధిగా నాయకులందరూ దారితప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. నేడు గ్లోబల్ ఐకాన్ అవార్డ్స్ పొందుతున్న వివిధరంగాల్లో ప్రతిభావంతులు, నిష్ణాతులు కూడా ఈ దిశలో తమ దృష్టినిసారించి దేశాభ్యుదయానికి అన్నివిధాలా పాటుపడాల్సిన అవసరముందని సూచించారు. సోమవారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ తృతీయ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశిష్ట అతిథులు రామచంద్రు తేజావత్, జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జకృష్ణ, దైవజ్ఞ శర్మ, మంజులగౌడ్ తదితరులతో కలిసి వివిధ రంగాల్లో ప్రతిభావంతులను ఘనంగా సన్మానించి గ్లోబల్ ఐకాన్ అవార్డులను ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపారు.



విజేతలకు కార్టూనిస్టు పురస్కారాలందిస్తున్న హరికృష్ణ, సత్యవాణి

## వైభవోపేతంగా తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం

**రవీంద్రభారతి, మే 20 ప్రభాతవార్త :** త్రికాలాలు, త్రిగుణాలు, త్రిభువనాలు, త్రినయనాల వంటి ప్రత్యేక వ్యవస్థలకు నిలువగలిగిన వ్యక్తి తలిశెట్టి రామారావు అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు., ఆయన జయంతిని తెలుగుకార్టూనిస్టుల దినోత్సవంగా ప్రతీయేటా జరుపుకొంటున్న తెలుగు జాతికి కార్టూన్ పోటీల్లో మీరు వేసిన కార్టూన్లు సందేశాన్ని, చైతన్యాన్ని కలిగిస్తున్నాయని కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపి కార్టూన్ల ప్రాశస్త్యాన్ని ప్రాముఖ్యతను విశదీకరించారు. సమాజంలో అన్నిరంగాల్లో చైతన్యానికి మూలభూతం, సమాజనిర్మాణంలో ఎంతో ప్రశంసనీయుడు కార్టూనిస్టు అని, నేడు సహేతుకమైన కార్టూన్లు రావాల్సిన అవసరముందని దైవజ్ఞశర్మ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్కళాభారతి, హాస్యానందం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు కార్టూనిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో హాస్యానందం సి.రాము నిర్వహణలో జరిగిన కార్టూనిస్టుల పురస్కారాలు తలిశెట్టి రామారావు; శేఖర్; బాపురమణ, బ్నిమ్మానందం ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, సుధామ, హర్షవర్ధన్, సత్యవాణి, బి.సుబ్బరాజు, దైవజ్ఞశర్మ, శంఖు తదితరులు ముందుగా ప్రముఖ కార్టూనిస్టు కృష్ణకిషోర్ కార్టూన్ పుస్తకాన్ని ఆవిష్కరించి అనంతరం కార్టూనిస్టు పోటీల్లో బహుమతులు పొందిన పలువురికి తలిశెట్టి రామారావు పురస్కారం, శేఖర్ పురస్కారం; బాపురమణ పురస్కారం; బ్నిమ్మానంద పురస్కారాలతోపాటు కె.వి.వి.సత్యనారాయణకు కార్టూన్‌మిత్ర పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో శుభాకాంక్షలు తెలిపారు.

## కాశీ విశ్వనాథ స్వామి ఆలయ ఆభరణాలు తనిఖీ



కాశీ విశ్వనాధ ఆలయ అభరణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

**కంటోన్మెంట్, మే 20 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రసిద్ధిగాంచిన శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలోని స్వామి వార్లకు సమర్పించిన బంగారు అభరణాలను సోమవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. ఆలయ అభరణాల్లో దాదాపు 5 తులాల బంగారం గోల్‌మాల్ అయినట్లు సమాచారం అందడంతో విషయం తెలుసుకున్న దేవదాయ శాఖ అధికారులు సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, జ్యూవెల్లరి వెరిఫికేషన్ ఆఫీసర్ అంజలి దేవి, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ప్రధాన అర్చకులు కాశీశర్మ, ఆలయ సీనియర్ అర్చకులు రామశర్మ, ఆలయ ఈఓలు మహేందర్ గౌడ్, విఠలయ్య, ఆలయ ధర్మకర్త రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దుండిగల్, మే 20 ప్రభాతవార్త:** విద్యుత్ తీగలకు అడ్డుతగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా దొమ్మరపోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11కెవి సత్యం ఫీడర్ పరిధిలోని గండిమైసమ్మ ఎక్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంల నుండి 9గంల వరకు, 11కెవి ఐడిఏ డిపి.పల్లి ఫీడర్ పరిధిలోని డిపి.పల్లి గ్రామం, సారేగూడేం, రాజరాజేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంల నుండి 10గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహాకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, మే 20 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు సంజీవినీ హిల్స్,నలంద నగర్,సిరిమల్లె నగర్,ఏజి కాలనీ ప్రాంతాలలో,12 నుంచి 2 గంటలు వరకు నలందనగర్,లోటాస్ స్కూల్,ప్లీశాంత్ పార్కు,న్యూ ఫ్రెండ్స్ కాలనీ బస్తీలలో,3 నుంచి సాయంత్రం 5 గంటలువరకు న్యూ ఫ్రెండ్స్ కాలనీ, జనప్రియ అపార్టుమెంట్,లక్ష్మీనగర్,ప్లీశాంత్ పార్కు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు తెలిపారు.

# గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కొనసాగించాలి

**-సేవాలాల్ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్**



మాట్లాడుతున్న భూక్యా సంజీవ్‌నాయక్

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:** సేవాలాల్ సేనా రాష్ట్ర కమిటీని సోమవారం రద్దు చేశారు. ఈమేరకు సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ ప్రకటన చేశారు. త్వరలోనే నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ సందర్భంగా భుక్యాసంజీవ్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులు తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది మంది సాధించుకున్న 10శాతం రిజర్వేషన్‌లను కొనసాగించాలని, ఇందుకోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని, కావాలని కొంత మంది స్వార్ధపరులు గిరిజనులకు 10శాతం రిజర్వేషన్‌లు దక్కకుండా హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేశారని, ఇదే రిజర్వేషన్ విషయంలో గతంలో హైకోర్టు 10శాతం రిజర్వేషన్‌లు కొనసాగించాలని తీర్పును వెలువరించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకుండా తాత్సారం చేయడం తగదని, వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతంలో జీవో 3 ద్వారా 100శాతం ఉద్యోగాలను అదే ప్రాంతం వారికి ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ కొంత మంది స్వార్ధపరులు సుప్రీంకోర్టులో కేసు వేసి కొట్టివేయించారని వివరించారు. గిరిజనుల హక్కులను సాధించేందుకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో కోర్ కమిటీ ఛైర్మన ధారావవత్ ప్రేమ్‌చంద్, రాష్ట్ర ఇంచార్జ్ మాలోతు సైదానాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, రైతు సంఘం అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ రాథోడ్, గ్రేటర్ అధ్యక్షుడు వి.కల్యాణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శులు ధారావత్ వెంకన్న, లకావత్ భాస్కర్, ఉపాధ్యక్షుడు రేఖ్యానాయక్, పరుశురామ్‌నాయక్, బాలునాయక్, మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి ఉత్సవాలు

**చార్మినార్, మే 20 ప్రభాతవార్త :** పాతబస్తీ దూద్‌బౌలిలో మహాత్మా శ్రీ బసవేశ్వర 891 జయంతి ఉత్సవాలు దూద్‌బౌలి బసవ సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దూద్‌బౌలి బసవ సమితి ప్రతినిధి బి.ఎన్.శెట్టి మాట్లాడుతూ మనుషులందరూ ఒక్కటేనని, సమాజంలోని ప్రతీ ఒక్కరూ శాంతి కోసం కృసి చేయాలని కోరారు. ప్రతీ సంవత్సరం దూద్‌బౌలి బసవ సమితి ఆధ్వర్యంలో పాతబస్తీలో శ్రీ బసవేశ్వర జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పలు ప్రాంతాలలో కొనసాగింది.

అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఊరేగింపులో దూద్‌బౌలి బసవ సమితికి చెందిన పలువురు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న దూద్‌బౌలి బసవ సమితి ప్రతినిధులు

# భార్య, భర్తలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు

- భార్య తనపై హత్యాయత్నం చేసిందని భర్త
- భర్త తనను హింసిస్తున్నాడంటూ భార్య
- విచారణ చేపట్టిన అల్వాల్ పోలీసులు

**అల్వాల్, మే 20 ప్రభాతవార్త:** ఇరువురు చదువుకున్న వారు పైగా నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్నారు. భార్య తనపై హత్యాయత్నం చేసిందని భర్త, భర్తనే తనను హింసిస్తున్నాడంటూ భార్య ఒకరిపై ఒకరు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. కుటుంబ కలహాలు నేపథ్యంలో వీరి వ్యవహారం చర్చాంశనీయంగా మారింది. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించిన అల్వాల్ పోలీసులు విచారణ ప్రారంభించారు.కేసుకు సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.ఆంధ్ర రాష్ట్రం రాజోలు వాస్తవ్యుడైన టిమూజియన్(40) వివాహం అమలాపురంకు చెందిన లక్ష్మిగౌతమి(38)తో ఎనిమిది సంవత్సరాలు క్రితం జరిగింది. కాగా వీరికి ఏడేళ్ల కొడుకు ఉన్నాడు. ఇరువురు నగర శివారు మేడ్చెల్‌లోని సిఎంఆర్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. టిమూజియన్ ఆంగ్లం అసిస్టెంట్ ప్రొఫెసర్ కాగా మల్లారెడ్డి యూనివర్శిటీలో లక్ష్మిగౌతమి ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తోంది. దంపతులు అల్వాల్‌లో నివాసం ఉంటున్నారు.

ఇదిలా ఉండగా తన భార్య వివాహం అయిన నాటి నుంచి శారీరకంగా మానసికంగా చిత్ర హింసలకు గురిచేస్తోందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం ఉదయం భార్య తనపై హత్యాయత్నం చేసిందని చేతులుపై ఉన్న గాయాలను ఆయన మీడియాకు చూపించడం జరిగింది. ఇంటికి తాళం వేసి కళాశాలకు వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుతం నేను రోడ్డుపై ఉన్నానని పర్సు, మొబైల్ తప్ప తన వద్ద ఏమీ లేవని తెలిపాడు. డబ్బు, ఆస్తులకు సంబంధించి తరుచు గొడవ పడేదన్నారు, రెండు రోజులుగా ఇంటికి వెళ్లకుండా బయట తిరుగుతున్నానని తెలిపాడు. ఇంటికి వెళితే భార్య కొడుతుందని పేర్కొన్నాడు.

భార్య వ్యవహారానికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకో లేదని ఆయన పేర్కొన్నాడు. తనతో పాటుగా తల్లి దండ్రులను వేదిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా భర్త ఫిర్యాదుతో పోలీసు స్టేషన్‌కు వచ్చిన లక్ష్మిగౌతమి తానే బాధితురాలినని పేర్కొంది. పురుషుడిపై నేను ఎలా హత్యాయత్నం చేస్తానని ప్రశ్నించింది. గాయాలు భర్తే చేసుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించింది. భర్త ఆరాచకాలకు సంబంధించి సాక్ష్యాధారాలను త్వరలోనే చూపిస్తానని తెలిపింది. భార్య భర్తలు ఫిర్యాదులు నేపథ్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్

## జూన్ 6 నుంచి త్రోబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 20, ప్రభాతవార్త :** జాతీయ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 ఈవెంట్‌ను నిర్వహించేందుకు తెలంగాణ అవకాశం కల్పించిన త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం కృతజ్ఞతలు తెలిపారు. సోమాజిగూడా ప్రెస్‌క్లబ్‌లో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ షెడ్యూల్‌ని త్రోబాల్ చైర్మన్ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, చీఫ్ ప్యాట్రన్ అమీర్‌అలీఖాన్, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, నేషనల్ గేమ్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, కోశాధికారి జమీల్, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణరాజ్‌పుత్, చిత్ర షెనోయ్, జాయింట్ సెక్రటరీ సిహెచ్.శ్రీనివాస్ తదితరులు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ జూన్ 6 నుండి జూన్ 8 వరకు హైదరాబాద్‌లో ఈ గొప్ప ఈవెంట్‌ని నిర్వహించేందుకు తెలంగాణకు అవకాశం కల్పించిన త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు సన్నాహకంగా, మా ఎంపిక బృందం తెలంగాణ త్రోబాల్ జట్టును మే 25, 2024న ఉదయం 10 గంటల నుండి హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఎంపిక చేస్తుందని, ఆసక్తిగల క్రీడాకారులు రావాలని అన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌ను స్మారక విజయంగా, పాల్గొనేవారికి, ప్రేక్షకులందరికీ మరుపురాని అనుభూతిని అందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

## పవర్‌లిఫ్టింగ్ పోటీలలో శశాంత్‌గౌడ్‌కు గోల్డ్ మెడల్

**చార్మినార్, మే 20 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ గొల్లకిడికి ప్రాంతానికి చెందిన బొంగు శశాంత్‌గౌడ్ హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్,ఏషియన్ యూనివర్శిటీ కప్ (2024)లో పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్‌ను సాధించారు.హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, ఏషియన్ యూనివర్శిటీ కప్ పోటీలలో పాతబస్తీ గొల్లకిడికి నివాసీ బొంగు శశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.శశాంత్‌గౌడ్ 120 ప్లస్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా పాతబస్తీ పురానాపూల్ నుంచి గొల్లకిడికి వరకు ర్యాలీ నిర్వహించారు.పెద్ద ఎత్తున శశాంత్ గౌడ్‌కు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ బి.బుచ్చిదాస్ గౌడ్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహించవసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్,ఏషియన్ యూనివర్శిటీ కప్(2024)లో పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సిధించిన బొంగు.శశాంత్ గౌడ్ ప్రస్తుతం లా చదువుచున్నారు. పాతబస్తీ బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా శశాంత్ గౌడ్ కొనసాగుతున్నారు.కాగా శశాంత్‌గౌడ్ తండ్రి బొంగు వినోభా గౌడ్ కేరళలో 1987లో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ (400) పోటీలలో బంగారు పతకాన్ని సాధించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్,హైదరాబాద్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు త్యాగరాజు,కార్యదర్శి దయానంద్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సాధించిన బొంగు శశాంత్‌గౌడ్


న్యాల్‌కల్‌లో రైతులకు జనుము విత్తనాలు అందచేస్తున్న ఏఓ లావణ్య

## న్యాల్‌కల్‌లో జనుము విత్తనాల పంపిణి షురూ

**న్యాల్‌కల్, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో మండల రైతులకు జనుము విత్తనాలు పంపిణి చేయడం మండల వ్యవసాయ అధికారిణి లావణ్య సోమవారం ప్రారంభించారు. మండలానికి సరఫరా అయిన 180 క్వింటాళ్ల జనుము విత్తనాలు సబ్సిడీ పోను రైతులకు 40 కిలోల బస్తాను 1448 రూపాయలు అందించినట్లు ఏఓ లావణ్య పేర్కొన్నారు. జనుము విత్తనాలు అందుకున్న రైతులు తొలకరి వర్షాలు కురిసాక భూమిలో తేమ ఉన్నప్పుడు మాత్రమే జనుము విత్తనాలు వత్తుకోవాలని మండల రైతులకు లావణ్య సూచించారు.

## వరుణ్‌మోటార్స్‌లో స్విఫ్ట్ కారు లాంచ్

**మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య**


స్విఫ్ట్ కారును లాంచ్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య

**చౌటకూరు, మే 20, ప్రభాతవార్త:** జోగిపేట పట్టణంలోని వరుణ్ మోటార్స్ షోరూమ్‌లో సోమవారం కొత్త షిఫ్ట్ కారును మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య కౌన్సిలర్ చిట్టిబాబులు లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ వాహనాలు కొనేందుకు ప్రజలు పట్టణ ప్రాంతాలకు పోవాల్సి పనిలేకుండా జోగిపేటలో వరుణ్ మోటార్స్‌ను ఏర్పాటుతో వాహనాల కొనుగోలుకు ప్రజలు వ్యాయప్రయాసాలకు లోనుకాకుండా ఇబ్బందులు తప్పాయన్నారు. జోగిపేటలో వరుణ్‌మోటార్స్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని కౌన్సిలర్ చిట్టిబాబు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్ చిట్టిబాబు, హరికృష్ణ, గాజుల అనిల్, మాజీ ఎంపిటిసి సభ్యులు రమేష్ గౌడ్, వరుణ్ మోటార్స్ యాజమాన్యం హరీష్ పాటిల్, ప్రవీణ్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు.

## నేటి నుంచి జనుము విత్తనాల పంపిణీ

**-వ్యవసాయ ఏడి బిక్షపతి**


పంపిణికి సిద్దంగా ఉన్న జనుము విత్తనాలు

**జహీరాబాద్, మే 20, ప్రభాతవార్త:** ఈ నెల 21వ తారీఖు నుంచి రైతులకు జనుము విత్తనాలను పంపిణి చేయనున్నట్లు వ్యవసాయ ఏడి బిక్షపతి తెలిపారు. 9050 ధర గల జనుము విత్తనాలను 5400 రూపాయల సబ్సిడీ పోనూ రైతులు క్వింటాలుకు 3620 రూపాయలు చెల్లించి అందుకోవాలన్నారు. 40 కిలోల జనుము బస్తాకు 1448 రూపాయలు చెల్లించి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు పత్రాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించి పర్మిట్లు పొంది జహీరాబాద్‌లోని డీసీఎంఎస్ కౌంటర్‌లో విత్తనాలు అందుకోవాలన్నారు. తొలకరి వర్షాలు పడ్డాక భూమిలో తేమ ఉన్నప్పుడు మాత్రమే జనుము విత్తనాలను విత్తుకోవాలని ఏడి బిక్షపతి రైతులకు సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**పట్టణ సీఐ రాజ బోయిన రవి**

**జహీరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తగు చర్యలు చేపట్టారని పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజబోయిన రవి సూచించారు. వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్‌సిలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే, వాహనాలను ఎక్కడ పడితే అక్కడ వాహనాన్ని ఆపితే సీజ్ చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను తోలాలన్నారు. అధికంగా శబ్దాన్ని ఇచ్చే వాహనాల సైలెన్సర్లు ఉంటే జరిమానాలు తప్పవన్నారు. రాత్రి 11.30 గంటల తరువాత తెరిచిన దాబాలు, హోటళ్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలనీల్లో అనుమానాస్పందంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే 100కు డయిల్ చేయాలని ప్రజలకు సిఐ ఆర్ రవి సూచించారు.

## మోర్గి ఆదర్శ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

**ప్రిన్సిపాల్ రమేష్**

**నాగల్‌గిద్ద, మే 20, ప్రభాతవార్త:** మండలంలోని మోర్గి ఆదర్శ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను విద్యను అందుకునేందుకు విద్యార్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఈసి గ్రూపులలో విద్యను ఆర్జించవచ్చని, ప్రతి గ్రూపులో 40 మంది విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. ఇటీవల ముగిసిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో, ఫోన్‌ల ద్వార ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తారీఖు లోపు ఎలాంటి ఫీజులు లేకుండా ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. బాలికలకు వసతి గృహం సదుపాయం ఉందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ సూచించారు.

## చౌటకూరులో రేణుక ఎల్లమ జాతర ప్రారంభం

**-పల్లకిలో అమ్మవారిని ఊరేగించిన భక్తులు**

**చౌటకూరు, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో సోమవారం రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గ్రామ శివారులోని నాయిని చెరువు వద్ద నుంచి రేణుక ఎల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకిలో ప్రతిష్టించుకుని గ్రామంలోని పురవీధుల గుండా భజనలు చేస్తూ, అమ్మవారిని స్మరిస్తూ ఊరేగించారు. అనంతరం సాయంత్రం వేళలో రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి తెప్పను తీసుకుని గంగకు బయలు దేరారు. గ్రామంలో కొనసాగుతున్న జారతను పురస్కరించుకుని అత్తారింటికి వెళ్లిన గ్రామ ఆడపడుచులు తమ పిల్లాపాపలతో గ్రామానికి చేరుకోవడంతో గ్రామం ఆడపడుచులతో సందడిగా మారింది. కార్యక్రమంలో గీత కార్మికులు పాల్గొన్నారు.


రేణుక ఎల్లమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

# అసంఘటితరంగ కార్మికులకు చట్టాలపై అవగాహన

## -జిల్లా ప్రధా న్యాయమూర్తి బి రమేష్



కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి రమేష్

**సంగారెడ్డి టౌన్, మే 20, ప్రభాతవార్త:** అసంఘటితరంగ కార్మికులు (భవన నిర్మాణ కార్మికులు) చట్టాలపై కనీస అవగాహన కల్గి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంసనత కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి రమేష్ అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిలాన న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి భవాని చంద్ర సూచనల మేరకు సోమవారం పట్టణంలోని భారతీయ మజ్దూర్ సంఘ్ భవనం కార్యాయలంలో అసంఘటితరంగ కార్మికులకు చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బి రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు అందుకునేందుకు కనీస వయసు 18 సంవత్సరాలు నిండి 60 సంవత్సరాల లోపు వారై ఉండాలన్నారు. నిర్మాణ కార్మికులు గత ఏడాదిలో 90 రోజులకు తక్కువ కాకుండా భవన, ఇతర నిర్మాణ పనులలో పని చేసి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వివాహ బహుమతి పథకం, ప్రసూతి లబ్ది పథకం, ప్రాణాంతక ప్రమాదాల లబ్ది పథకం, ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక సహాయాన్ని అందుకునే పథకం, సాధారణ మరణం లబ్ది పథకం, ప్రమాదాల మూలంగా తాత్కాలిక వైకల్యంనకు సహాయం, దహన సంస్కారాల ఖర్చుల చెల్లింపు పథకం, వృత్తి నిర్మాణంతోవరసులకు వృతి శిక్షణ, జాతీయ పించను పథకంలలో నమోదు చేసుకుని కార్మికులు లబ్ధిపొందాలన్నారు. ఉచిత న్యాయం కొరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్మికులు సంక్షేమ పథకాలను అందుకునేందుకు ఇబ్బందులు పడితే ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యాదయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నరినసంహారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

**కొల్చారం, మే20 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి సోమవారం పర్యటించి పలువురిని పరామర్శించారు. సొసైటీ చైర్మన్ నాగురి మనోహర్‌కు ఇటీవల శస్త్ర చికిత్స జరిగింది. మాజీ ఉప సర్పంచి ఎండుగుల కృష్ణ తండ్రి ఎండుగుల సత్యానారాయణ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కోలుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చౌరిగారి నర్సింలు పక్షవాతంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చారు. వీరందరినీ ఎమ్మెల్యే వాకిటి సునితా లక్ష్మారెడ్డి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మహమ్మద్ కుటుంబీలకు బీఆర్ఎస్ పార్టీ ప్రమాద భీమా చెక్కును అందజేశారు. కొల్చారం గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ పోతగల్ల బాలయ్య కూతురు వివాహం బాబా గార్డెన్‌లో జరగగా, హాజరై వధూరులను ఆహ్వానించారు. ఆమె వెంట మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కరెంట్ రాజాగౌడ్, చెన్నయ్య, వడ్ల ప్రభాకర్, చిన్న రాములు, పాంద్ర వెంకటేశం, సాతెల్లి శేఖులు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఉదయ వేమారెడ్డి, కోనాపూర్ మాజీ సర్పంచి రమేష్ తదితరులు ఉన్నారు.

## తుర్కపల్లిలో ఘనంగా భూలక్ష్మమ్మ జాతర

**నారాయణఖేడ్ టౌన్, మే 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలను ప్రజలు సోమవారం ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. జాతరను పురస్కరించుకుని నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. యువకులు కేరింతలు వేస్తుండగా మల్లయోధులు కుస్తీ పడ్డారు. జాతర కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు దత్తుగౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు సాయిరెడ్డి,మల్లేశం, జ్ఞానేశ్వర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివకుమార్, నరసింహారెడ్డి, విద్యా కమిటి చైర్మన్ విఠల్‌గౌడ్, ఉప్పరి వెంకన్న, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు : ప్రతాప్‌రెడ్డి



**కొండపాక, మే 20, ప్రభాతవార్త** కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన వేణు మాధవ్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వేణు మాధవ్‌కు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా అతనికి ఇన్సురెన్స్ డబ్బులు మంజూరి కావడంతో మృతుని భార్య పద్మకు మంగళవారం రూ॥ 2 లక్షల ప్రమాధ బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్యకర్తలను పార్టీ ఎప్పుడు కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. కార్యకర్తలు లేకుంటే పార్టీలే ఉండవన్నారు. కార్యక్రమంలో మల్లం ఐలయ్య, వైస్ ఎంపిపి, ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఈజిఎస్ రాష్ట్ర నాయకురాలు కొల సద్గుణ రవి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, పిఏసిఎస్ వైస్ ప్రెసిడెంట్ అమరేందర్, ర్యాగల దుర్గయ్య, కొంతం రాజు, అమ్మద్, గౌటి సంపత్, చాకలి శ్రీనివాస్, చంద్రశేఖర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


ఏడుపాయల్లో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## ఏడుపాయల హుండీ ఆదాయం 45 లక్షలు

**పాపన్నపేట, మే 20, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ హుండీని సోమవారం రాజరాజేశ్వరి సేవా సమితి అధ్వర్యంలో ఆలయ ఆవరణలోని గోకుల్ షెడ్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్స్‌పెక్టర్ రంగారావుల పర్యవేక్షణలో లెక్కించారు. మహా జాతరను పురస్కరించుకుని (70 రోజుల హుండీ) ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి భక్తులు 45 లక్షల 50వేల 681 రూపాయలను సమర్పించుకున్నారని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్స్‌పెక్టర్ రంగారవు, ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాదయ్య, సాయిలు, బాగారెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, యాదగిరి, రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు హుండీ లెక్కింపు సందర్భంగా పాపన్నపేట పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## అందుబాటులో జీలుగ, జనుము సబ్సీడి విత్తనాలు

**వ్యవసాయ అధికారి సంతోష్**

**బెజ్జంకి, మే 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో పచ్చి రొట్ట ఎరువులు జీలుగ, జనుము విత్తనాలు సబ్సీడిపై అందుబాటులో ఉన్నాయని అవసరం ఉన్న రైతులు పట్టా పాస్ పుస్తకం, అధార్ కార్డు జిరాక్స్‌తో మండలంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎఈఓల వద్ద ధృవీకరణ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సంతోష్ సోమవారం తెలిపారు. జీలుగ 30 కిలోల బ్యాగు రూ.1120, జనుము 40 కిలలో బ్యాగు రూ.1450 లభిస్తుందన్నారు. పొలంలో జీలుగను కలియదున్నడం వలన నేలకు అపై వేసే పంటలకు విశేషమైన లాభాలను అందిస్తాయని తెలిపారు. జీలుగ సాగుతో మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో పాటు మొక్కలకు రెండు శాతం నత్రజని,సూపర్ ఫాస్పెట్, జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు అదనంగా అందిస్తాయని తెలిపారు. జీలుగ విత్తనాలు చల్లిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోనే పంట ఏపుగా పెరుగుతుందని ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసర పడుతాయన్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలని లేదా రోటోవేటర్ సహాయంతో కలియదున్నడంతో వరి సాగులో అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ట్రాక్టర్‌లో డీజిల్ బదులు పెట్రోల్

**చిన్నశంకరంపేట,మే20,ప్రభాతవార్త:** ట్రాక్టర్‌లో డీజిల్ బదులు పెట్రోల్ పోసిన ఘటన మండల పరిధి గవ్వలపల్లిలోని హెచ్‌పి పెట్రోల్ పంపులో సోమవారం చోటు చేసుకుంది. సంగాయపల్లి గ్రామానికి చెందిన పెద్దంకి రాజు తన జాన్‌డీర్ ట్రాక్టర్‌ను తిసుకొని డీజిల్ పోసుకోవడానికి గవ్వలపల్లి చౌరస్తాలోని హెచ్‌పి పెట్రోల్ పంపుకు వెళ్లాడు. ట్రాక్టర్‌లో 960 రుపాయల డీజిల్ పోయాలని పంపు నిర్వాహకులకు సూచించగా, పంపు నిర్వాహకుడు దీంతో అతను డీజిల్‌కు బదులు పెట్రోల్ పోశాడు. ఈ విషయాన్ని గమనించిన ట్రాక్టర్ యజమాని రాజు డీజల్‌కు బదులుగా పెట్రోల్ ఎందుకు పోశావని, ట్రాక్టర్ ఇంజన్ పాడైపోతుందని అతను ఆందోళనకు దిగాడు. పంపు నిర్వాహకులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబధిత అధికారులు ఇప్పటికైన పెట్రోల్ పంపులను పర్యవేక్షించాలని వినియోగదారులు కోరుతున్నారు. పెట్రోల్ బంకు నిర్వాహకులు ట్రాక్టర్‌ను రిపేర్ చెయించి ఇస్తామని హామి ఇచ్చారు. ఆందోళన విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట పోలీసులు పెట్రోల్ బంకు వద్దకు చేరుకొని ట్రాక్టర్ యజమానికి సముదాయించి పంపారు.


గవ్వలపల్లి పెట్రోల్ పంపులో ఆందోళన చేస్తున్న ట్రాక్టరు యజమాని రాజు

# సభ్యుల చేరికతోనే లయన్స్‌క్లబ్ బలోపేతం

**ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం**

**రాజశేఖర్‌రెడ్డి సేవలు అభినందనీయం**

**లయన్స్ క్లబ్ ఏరియా లీడర్ సునీల్‌కుమార్**



అవార్డు ప్రధానం చేస్తున్న దృశ్యం

**రామాయంపేట, మే 20, ప్రభాతవార్త :** అవసరం ఉన్నవారికి, ఆర్తులకు మేం సేవలందిస్తాం అనే నినాదంతో అంతర్జాతీయంగా లయన్స్ సభ్యులు సేవలందిస్తున్నారని ఈ సంవత్సరం అంతర్జాతీయ అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పట్టిహిల్ "చేంజ్ ద వరల్డ్" అనే నినాదంతో లయన్స్ సంస్థ ద్వారా అన్ని రకాల సేవలతో పాటు, సంస్థను బలోపేతం చేయడానికి సభ్యుల చేరిక కూడా అవసరమని, ఎంతమంది నూతన సభ్యులను చేర్పిస్తే వారిని అత్యున్నతంగా గుర్తింపునిస్తామని, అలాగే బంగారు పథకాలను, ప్రశంసా పత్రాలను ఇచ్చి ప్రోత్సహిస్తామని, 15 రోజుల్లో నూతన సభ్యులను చేర్పిస్తే వారిని, వారి సేవలను ప్రోత్సాహకాల ద్వారా గుర్తిస్తామని ఇచ్చిన పిలుపుమేరకు నూతన సభ్యులను లయన్స్‌క్లబ్‌లో చేర్పించి, గత 34 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ రామాయంపేట ద్వారా ఆరోగ్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అవయవదాన అవగాహన కార్యక్రమాలు చేపడు తున్న లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని వసుధ కన్వెన్షన్ లో నిర్వహించిన తెలంగాణ ప్రాంతములోని ఏడు లయన్స్ జిల్లాలు 320-ఏ, బి, సి, డి, ఈ, ఏఫ్, ఏచ్ జిల్లాల నుండి వచ్చిన లయన్స్ నాయకుల అవార్డ్స్ ప్రధానోత్సవంలో అంతర్జాతీయ అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పార్టీ హిల్ ద్వారా నెలకొల్పిన గోల్డ్ మెడల్ మరియు ప్రశంసా పత్రాన్ని లయన్స్ ఏరియా లీడర్ సునీల్ కుమార్, కౌన్సిల్ చైర్మెన్ తీగల మోహన్‌రావు, గ్యాట్ లీడర్లు మనోజ్‌కుమార్ పురోహిత్, దీపక్ భట్టాచార్య జి, లయన్ డాక్టర్ జి. బాబురావు గవర్నర్ వి. లక్ష్మిగార్ల చేతుల మీదుగా ప్రధానం చేస్తూ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి సంవత్సరం లయన్స్ జిల్లా క్యాబినెట్లో సభ్యుడిగా, నాయకుడిగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు లయన్స్ లీడర్లు అభినందిం చడం జరిగింది. ఈ మల్టిపుల్ కన్వెన్షన్‌లో 320-డి లయన్స్ లీడర్లు నగేష్ పంపాటి, లయన్ అమర్నాథ్‌రావు, లయన్ ఎం.విజయలక్ష్మి, లయన్ టి.పద్మావతి, లయన్ ఎం.నాగరాజు, లయన్ నరసింహరాజు మరియు లయన్ మర్రి ప్రవీణ్, లయన్ సూర్యనారాయణ, అసపల్లి శ్రీధర్, మాజీ గవర్నర్లు లయన్ బి.వి. బన్సల్ రమేష్, ప్రకాష్‌రావు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, సూర్య రాజ్, ఓబుల్‌రెడ్డి, కోటిరెడ్డి, రంజిత్‌రెడ్డి, అమరేం దర్‌రెడ్డిలు కన్వెన్షన్ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడినడ, రాజిరెడ్డిలు పాల్గొని రాజశేఖర్‌రెడ్డి సేవలను అభినందించారు. మరియు రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు పి. కేశవరెడ్డి, లయన్ రాధా కృష్ణారెడ్డి, లయన్ నటరాజ్, లయన్ గోలి అమరేందర్‌రెడ్డిలు ఇతర నాయకులు రాజశేఖర్‌రెడ్డి అవార్డును అందుకోవడం పట్ల హర్షాన్ని ప్రకటించారు.


విలేకరులతో మాట్లాడుతున్న శ్యాంమోహన్

## రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర

**పార్లమెంటు ఎన్నికల్లో మంచి ప్రభావం చూపుతుంది**

**రాష్ట్రంలో 10 నుంచి 12 స్థానాలను గెలుచుకుంటాం**

**టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సభ్యులు : శ్యాంమోహన్**

**సిద్దిపేట రూరల్, మే 20, ప్రభాతవార్త:** ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చిందని అ స్పందనే పార్లమెంటు ఎన్నికల్లో ప్రభావం చూపబోతుందని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మేధావుల సంఘం చైర్మన్ అనంతుల శ్యాంమోహన్ అన్నారు. సిద్దిపేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. సోనియా, ప్రియాంక, రాహుల్‌గాంధీలతో పాటు మల్లికార్జున్ ఖర్గేను దేశ ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి 270కి పైగా స్థానాలను కైవసం చేసుకొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందన్నారు. రాహుల్‌గాంధీ తుక్కుగూడలో విడుదల చేసిన మ్యానిఫెస్టోకు పార్లమెంటు ఎన్నికల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 10 నుంచి 12 స్థానాలను గెలిచితీరుతుందన్నారు. మేధావి వర్గం నుంచి తెప్పించుకున్న రిపోర్టు ప్రకారం దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి మంచి పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేసి తీరుతుందన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరని కలిసి తమ స్వంత గ్రామమైన కొండపాక సమస్యలు పరిష్కరించాలని విన్నవించగా అయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. మల్లన్నసాగర్ బాధితులకు న్యాయం చేయాలని విన్నవించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, మార్క సతీష్, డీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**న్యాల్‌కల్, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని హద్నూర్, చాల్కి గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మత్తుల కారణంగా ఆయా విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని విదుయనయత్ ఏఈ అర్జున్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## బాలవికాస వాటర్ ప్లాంట్ ఎన్నికలు నిర్వహించండి

**మున్సిపల్ కమిషనర్‌కు బిసి సంఘం నాయకుల వినతి**

**హుస్నాబాద్,మే20,ప్రభాతవార్త** హుస్నాబాద్ పట్టణంలోని బాలవికాస వాటర్ ప్లాంట్‌ల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ సోమవారం రోజున బిసి సంక్షేమ సంఘం నాయకులు పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 సంవత్సరాల క్రితం మున్సిపల్ చైర్మెన్‌గా సుద్దాల చంద్రయ్య హయాంలో ఆరెపల్లికి సంబందించిన ఎన్నికలు జరిపారని గుర్తు చేశారు. నిబందనల ప్రకారం ఐదేళ్లకు ఒక్కసారి ఎన్నికలు నిర్వహించాలని ఈ విషయంలో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో ఆ సంఘం నాయకులు వరియోగుల అనంతస్వామి, సంతోష్,రాంప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రారంభమైన అడ్మిషన్లు

**హుస్నాబాద్,మే20,ప్రభాతవార్త** హుస్నాబాద్‌లోని తేజస్విని ఐటిఐ కళాశాలలో మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఐటిఐ చేయాలను కునే విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని అడ్మిషన్ల కోసం వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్ లేదా కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం పరిమినెంట్ ఫోన్‌నంబర్‌తో పాటు ఈమెయిల్,ఆధార్ కార్డు జిరాక్స్,పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలని ముఖ్యంగా పదవ తరగతి మార్కుల మెమోలో వివరాలు ఆధార్ వివరాలు ఒక్కటై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9866778087 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోండి

**తహశీల్దార్‌కు బిజెపి నాయకుల వినతి**



**హుస్నాబాద్,మే20,ప్రభాతవార్త** రాష్ట్రంలో ఇటీవల కురిసన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ సోమవారం బిజెపి పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ తహసీల్దార్ రవిందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం రూరల్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్‌తో కలపి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయడంతో పాటు ఇటీవల కురిసన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షులు బొమ్మగాని సతీష్,పార్టీ ప్రధాన కార్యదర్శి రాయికుంట చందు,నాయకులు సంపత్‌నాయక్, మహేశ్వరరెడ్డి, సమ్మయ్య,మహేష్కర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకుల పంపిణీ

**అక్కన్నపేట,మే20,ప్రభాతవార్త** మండలంలోని పంతుల్‌తండా పరిధిలోని తారాచంద్‌తండాకు చెందిన లావుడ్య హేమ్లీ ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న తండా పెద్దలు సోమవారం రోజున వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 25కిలోల బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు లాలునాయక్, చిన్నానాయక్,సదానందం,వీరానాయక్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**గుమ్మడిదల, మే20 ప్రభాతవార్త:** గుమ్మడిదల గ్రామానికి చెందిన బదనపురం దశరథ గత నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబంలో పెద్ద కుమార్తె షుగర్ వ్యాధితో బాధ పడుతుంది. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకొని బాధిత కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు సీజీఆర్ ట్రస్టు చైర్మెన్ చిమ్ముల గోవర్ధన్ కుల పెద్దల ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.

## ఘనంగా రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం

**కొల్చారం, మే20 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలోని రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగనాయక స్వామి జాతర ఉత్సవాల్లో సందర్భంగా మూడవ రోజు రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోత్సవాలతో కన్నుల పండుగగా జరిగింది. ముందుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుండి ఎదుర్కోలు నిర్వహించి కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పెళ్లి పెద్దలుగా కామిని జనాభాయ్ ప్రభాకర్, బొద్దుల రాజు దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు, పుస్తె మెట్టెలు సమర్పించారు. బొద్దుల రమేష్ బాబు, కామిని శ్రీనివాస్, విజయ్ ప్రకాష్, మాసిని అశోక్, మహేందర్, రమేష్, సత్యం, కుమార్, వెంకటేశం, సంతోష్, పాండు, రాజు, శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

